కనక అది పెట్టుకుందుకి ఒక చిన్న గారేజీలాంటిది ఉండాలి.

మరొక సంగతి : ఇల్లు తనదికదా అని ఇంటాయన తరుచు మా యింటికి వస్తాడేమో, పనికి రాదు. వాడిల్లు మాకిచ్చినందుకుగాను మేం రమ్మన్నప్పుడు వచ్చి, కిక్కురుమనకుండా అద్దిడబ్బులు పట్టుకెళ్ళాలిందే. అంతే. మాటిమాటికీ అద్దె పెంచటుంగాని, ఇల్లు ఖాళీ చేయమనటుంగాని ... ఇలాంటి పిచ్చి పన్లు ఏం పనికిరావు.


ఇంటికేవేనా రిపేర్లూ అవీ వస్తే, వెంట వెంటనే చేయించాలి. లేకపోతే చెప్పకుండా మేమే చేయించి, అద్దిలో విరగ్గోసి పారేస్తాం.

నాకు మాటపట్టింపు జాస్తీ, తెలుసుగా ? – అద్దెకున్నవాళ్ళం కదా అని ఇంటివాళ్ళు మామీద జులుం చెలాయిస్తే పడేవాళ్ళంకాము .ఎంతమాత్రం సహించం. వాడెంత,చేను, వాడిల్లెంతజేసు!–అయినా మామీద జులుం చెయ్యటానికి వాడెవడండీ పుల్లయ్య ? ఇదిగో, ఏఁవండోయ్!– ఒకటేమాట చెబుతున్నా – నేనెవడి జోలికిపోను, నాజోలికెవడేనా వస్తే ఊరుకోను. ఆరు నూరయ్యేది, నూరు ఆరయ్యేది–హైకోర్టుకెక్కించందేనిద్దరోను. తెలిసిందా, అం ?–


అఁ – అఁ – ఉండండి. అప్పుడే లేస్తారేం ? – పనుందా ? – సరే – రండి, నేనూ అందాకా వస్తా ...

***

---






మా యింటిపేరు, వూరు పేరు కూడా ఒంగోలే – నా పేరు లక్ష్మి. మా నాన్నగారి పేరు బసవయ్య. మా అమ్మ పేరు పార్వతి. మా నాన్నగారు చాలాబలంగా, పుష్టిగా, గంభీరంగా వుండేవారు. ఆయన్ని ఎందరో వరించారు. ఆయనమీద మోజుపడి, పొరుగూళ్లనుంచి కూడా ఆయన కోసం వచ్చేవారు. మా అమ్మకు సవతులు చాలా మంది వున్నారు. కాని, వాళ్ళు ఎప్పుడూ మా అమ్మతో పోట్లాడేవారు కాదు.

నా చిన్నతనంలోనే మా వంశ ప్రతిష్ఠ విన్న ఒకాయన గోదావరి ప్రాంతం నుంచి మా యింటికి వచ్చారు. నన్ను చూసి, మెచ్చి, తమ ఊరు తీసుకెళ్తా నన్నారు. అందుగ్గాను మా యజమానికి డబ్బు కూడా యిచ్చారు. నేను వెళ్ళిపోతున్నానని మా అమ్మ చాలా బాధ పడింది. మా యజమాని పిల్లలు – నాతో చిన్నతనంలో ఆడుకున్న వాళ్ళు – నన్ను వదిలి వుండలేక ఏడ్పు మొదలెట్టారు వాళ్ళ నాన్నగారు – పాపం ! – వాళ్ళందర్నీ దబదబా బాది లోపలకు తీసుకెళ్ళారు. నన్ను కొన్నాయన కూడా నన్ను మా అమ్మనీ విడదీస్తున్నందుకు బాధ పడ్డారు. నేను కూడా కళ్ళనీళ్ళు ఆపుకుని గుండె రాయి చేసుకుని ఆయనవెంట వెళ్ళాను.

అయనా నేనూ పగలు నడిచి

నంత నడిచి, రాత్రులు నిద్ర పోయి వాళ్ళ యిల్లు చేరాము. నేను యింటికి రాగానే మా 'అమ్మగారు' ఎదురొచ్చి 'లక్ష్మి వచ్చిందిరా' అంటూ హారతియిచ్చి, నన్ను లోపలకు తీసుకెళ్లారు.

అది చిన్నపల్లెటూరు. ఊరు చిన్నదైనా చాలా అందంగా వుంది. నాకు ఆ ఊళ్ళోనే పెళ్ళయింది. శ్రీవారి పేరు ... ఎలా చెబుతాను? ... సిగ్గుకాదూ? ... ఆయనది ఆ వూరు కాదు. ఆ పక్కనేవున్న మరో పల్లెటూరు. ఆయన ఆ వూళ్ళోనూ— నేను ఈ వూళ్ళోనూ కాపురం. మా తొలి సంతానం కోడెగాడే! ముద్దుగా తండ్రి పోలికనే వుండేవాడు. వాణ్ణిచూస్తే నాకు ఆయన్ని చూస్తున్నట్టే వుండేది. అందుకే ఆయన ఇంటిపట్టున వుండకపోయినా నేను కాలక్షేపం చేయగలిగాను.

మా ఊరు పచ్చగా కళకళలాడుతూ వుండేది. ఊరుబయట విశాలమైన పచ్చిక బయళ్ళుండేవి! ఆ వూళ్ళోవున్న స్నేహితులమంతా కలిసి, అక్కడకు వెళ్ళేవాళ్ళం! మా అందరికీ తోడుగా కొందరు చిన్నపిల్లలు కూడా వచ్చేవారు. కొందరు పిల్లనగోవి వూదేవారు. ఆ పిల్లనగోవి వింటూంటే, ఎంతో ఆనందంగా వుండేది. మా శ్రమఅంతా మర్చిపోయేవాళ్లం. పగలంతా కడుపునిండా పచ్చికమేసి పొద్దుకుంకే సమయానికి యిళ్లకు తిరిగేవాళ్లం. వస్తూవస్తూ చెరువులో మేమంతా—మాకుతోడుగా వచ్చిన పిల్లలు గూడా — హాయిగా ఈతలు కొట్టుకుని మరీ యిల్లు చేరేవాళ్ళం.

ఇంటికి చేరేసరికి "లక్ష్మి! వచ్చావా?" అని మా 'అమ్మగారు' ఎంతో ఆప్యాయంగా పిల్చి, అప్పటికే సిద్ధంగా వుంచిన చిట్టు, ఉలవలూ, కుడితీ అన్నీ పెట్టేది! అవి తింటూ పాలు యిచ్చేదాన్ని! ఆమె పాలు పితుకుతూ, "లక్ష్మి! మేము తిననివీ, తినలేనివీ నువ్వు తింటావ్! మేం యిచ్చిన నీళ్ళకు బదులుగా పాలు యిస్తున్నావ్. నీ ఋణం ఎలా తీర్చుకోగలం తల్లీ?" అంటూ వుండేది. ఆ మాటలు వింటూంటే, నాకు కొంచెం గర్వంగానే వుండేది. ప్రతీ శుక్రవారం ఆమె నాకు పసుపు రాసి, కుంకుమపెట్టి పూజచేసేది. తెల్లవారుఝామునగుడిలో సన్నాయి వినబడేది! అది వింటూంటే, దేవుడికి మేమింత దగ్గరగా వున్నామా అని తోచేది! మా అమ్మగారు వచ్చి, "లక్ష్మి! మేనకేశ్వరస్వామికి పాలు కావాలిట—ఇస్తావా?" అని పిలిచేది. ఆ పాలు దేవుడికిఅభిషేకంచేసేవారు. నేనుఎప్పుడేనా, ఆదారినపోతూంటే, ఆ పూజారి నన్ను పిలిచి, అరటిపళ్ళు పెట్టేవారు.

ఆ ఊళ్ళో వున్నంతకాలం నా జీవితం హాయిగా వుంది. ఇంతలో వాళ్ళ అమ్మాయికి పెళ్ళయింది. నన్ను ఆ అమ్మాయితోపాటు అత్తవారింటికి పంపించారు.



ఆ బస్తీలో పచ్చికబీళ్ళు లేవుట! దేవాలయం వుందోలేదో నాకు తెలియదు. పల్లెవిడిచి బస్తీరావడం నాకు కొత్తలో కొంచెం కష్టంగానే వుండేది. అన్నిటికన్నా ముఖ్యం స్నానానికి మరీ యిబ్బందిగా వుండేది! మాఊళ్ళో రోజూ హాయిగా స్నానం చేసేదాన్ని! ఇక్కడ రెండు మూడు రోజులైనా స్నానం వుండేదికాదు. పాపం! వాళ్ళు మాత్రం ఏంచేస్తారు! వాళ్ళస్నానానికే నీళ్ళులేవు. నాలుగైదు రోజులకోసారి ఓ బొక్కెడు నీళ్ళు పోసి, నా ఒళ్ళు కడిగేవారు. ఉలవలు, చిట్టు అవి బాగానే పెట్టేవారు. ఈమాత్రం పచ్చగడ్డి తెచ్చి నా ముందగ పడేసి వెళ్ళిపోయేవారు. ఇరవైనాలుగంటలూనన్ను గాటకుకట్టి వుంచేవారు. మా వాళ్ళు ఎవరూ కనబడే వారుకారు. పొద్దున్నా, రాత్రీ ఒక నల్లటాయన సైకిల్ మీద వచ్చి గబగబా పాలుపితికి వెళ్ళిపోయేవాడు! ఇతను పాలు పిండుతూంటే ఎంతో బాధగా వుండేది! మా 'అమ్మగారి' దగ్గర అలవాటైవచ్చానేమో, ఈయన మోటుతనం భరించలేకపోయేదాన్ని! కాని ఏం చెయ్యను! ఎదురుగా మా అమ్మాయిగారు కూచుని వుండేది! ఆమెకోసం పాలు ఇచ్చేదాన్ని! వాళ్ళ పక్కింటామె రోజూ వచ్చి గ్లాసుడు పాలు అడిగి తీసుకెళ్ళేది. బిడ్డకి ఆమె పాలు యివ్వదట! అలా యిస్తే చిక్కిపోతావని ఆమె కెవరో చెప్పారట! ఇదేం విడ్డూరమో!

ఇంతలో వాళ్ళకి హైద్రాబాదు బదిలీ అయింది. వాళ్ళతో నన్ను తీసుకెళ్ళాలనే అనుకున్నారు. నన్ను తీసుకెళ్తే వాళ్ళు యిబ్బంది పడిపోతారని వాళ్ళ నాన్నగారు ఒద్దన్నారు. "పోనీ మా వూరు పంపెయ్యండి" అని మా అమ్మాయిగారు బతిమాలారు. కాని, ఆమె మామగారు, "అరణం యిచ్చిన ఆవు మా సొత్తు, మా యిష్టం" అని నన్ను ద్వారపూడి సంతకు పంపించేశారు.

ఆ సంతలో అంతా మావాళ్ళే! దేశంలో అక్కరలేని ఆవులు యిన్ని వున్నాయా అనిపించింది. కాని, కొందరు మమ్మల్ని కొనుక్కునేందుకు వస్తారుగా! కొందరికి అక్కరలేకపోయినా కొందరికి కావాలికదా అని తృప్తి పడ్డాను.


నన్ను, మరో పదిమందినీ ఒకాయన కొనుక్కు తీసుకు వెళ్లారు. మమ్మల్ని అందర్నీ రైలు ఎక్కించారు. మేమంతా కలిసి హైదరాబాదు చేరాం. మావాళ్ళతో కలిసి చేసిన రైలు ప్రయాణం నాకు ఏమంత శ్రమ అనిపించలేదు. అసలే మా వాళ్ళ మొహం చూడ్డానికి నేను మొహం వాచి వున్నానేమో, హైదరాబాదు చేరేసరికి నా ప్రాణం లేచి వచ్చింది. మమ్మల్నందర్నీ ఒక పెద్ద పొలంలోకి తీసుకెళ్ళారు. పెద్ద పచ్చిక బయ

లుంది. కొంచెం వూడుపు భూమీ వుంది. అక్కడ కూడా పాపం – ఆయన మమ్మల్ని బాగానే చూసేవారు. జబ్బుచేస్తే లారీలో ఆస్పత్రికి తీసుకు వెళ్ళేవారు.

ఉన్నట్టుండి, ఎవరో ఆయనతో ఈ పాలవ్యాపారంకంటే, ద్రాక్షతోట పెంచితే లాభసాటి అన్నారట! ఆ పచ్చిక బయలు అంతా ద్రాక్షతోట చేస్తూ మా అందర్నీ తలొకరికి అమ్మేశాడు. అప్పుడు నేను గర్భవతిని. నన్ను ఒకాయన కొని తీసుకెళ్ళాడు–ఆయనదీపాలవ్యాపారమే. వాళ్ళింట్లో నేనుగాక, మరో రెండు గేదెలున్నాయి. మా అందర్నీ ఒక దొడ్డిలో కట్టేసేవారు. నాకు ఆ గేదెలలో వుండడం అసహ్యంగా వుండేది! ఎందుకంటే వాటికి శుభ్రం తక్కువ. అయినా ఏంచేస్తాం ! "సహజీవనం" చెయ్యాలిగా! అలాగే కాలక్షేపంచేశాను. నాకుఓబాబుపుట్టాడు. పెద్దవాడంత ముద్దుగా లేడు – ఏవిటో మరీ నీరసంగా పుట్టాడు. అది వాడి తప్పుకాదు. నేను వెనకటంత బలంగా లేను. నాకు బలమైన తిండిలేదు–బాబు పుట్టిన రెండు రోజుల తర్వాత నాకు కన్పించలేదు–చంపేశారని తెలిసింది. ఇంతవరకూ ఇలాంటి కష్ట మెరగను. తిండి సహించలేదు. నన్నెవరూ 'అయ్యో పాపం!' అని ఓదార్చలేదు. ఇంతలో ఒక 'చేత' పెయ్యను తీసుకువచ్చి, నా బిడ్డ అని భ్రమ పెట్టారు. ఆ మాత్రం నేను గుర్తు పట్టలేననుకున్నారు – ఒకరిలా మరొకర్ని భగవంతుడే సృష్టించలేక పోతున్నాడే! మానవుడికి సాధ్యమా! చచ్చినవాడి ఫొటోను బతికున్న వాళ్ళు పూజించినట్టు, ఆ చేత పెయ్యనే మా బాబు అనుకుని సరిపెట్టుకునేదాన్ని! అలాగే కాలక్షేపం చేస్తూ, వున్నంతలో పాలు యిచ్చేదాన్ని! నా పాలూ, గేదెపాలూ నీళ్ళతో కలిపి 'ఆవుపాలు' అని అమ్మేవారు. "నేను అమ్మేవి ఆవుపాలే అని నమ్మించడానికే నన్ను ఆయన కొన్నాట్ట! ఇదిచూస్తే మాత్రం నాకు చాలా అవమానంగా వుండేది! అక్కడ నాకు మళ్ళీ ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల కనక చంపలేదట!

ఆయనెవరో నన్ను మా అమ్మాయినీ కొనుక్కుని, ఓ పెద్ద యింట్లోకి తీసుకు వెళ్లారు. ఇల్లూ అదీ చూసి, హాయిగా తిరగొచ్చు – తినొచ్చు. నాకు మంచి రోజులు వచ్చాయి అనుకున్నాను. కాని, తీరా లోపలకు వెళ్ళేసరికి ఏవో మంత్రాలు వినబడ్డాయ్. పాపం! ఆ యింటి యజమాని పోయాట్ట! అయ్యో! ఇదేమిటి నేను కాలుపెట్టిన వేళా విశేషమా అనుకున్నాను. కాదు – ఆయనపోయి అప్పుడే పదిపన్నెండు రోజులైందట! ఆ రోజున మా వాళ్ళని యిలా దానంచేస్తే వాళ్ళ వాళ్ళకి చాలా పుణ్యమట! చచ్చిపోయిన ఆ పెద్దమనిషి యమలోకానికి వెళ్ళేప్పుడు అదేదో నదిని దాటడానికి బంగారపు ఆవు వస్తుందట! ఆ పోయిన ఆయన యమలోకమే పోతాడని వీళ్ళింత గట్టిగా నమ్ముతున్నారు– ఆయన అన్ని పాపాలు చేశాడా అనుకున్నాను.

ఆ దానం పట్టిన ఆయన నన్ను తీసుకు పోతున్నాడు. వీథి వెంట నడిచిపోతూ, మా అమ్మాయిగారూ, అల్లుడుగారూ కనబడతారేమోనని వెతుకుతూ వెళ్లాను. నా అదృష్టం బాగుంది. ఇద్దరూ చిలకా గోరింకల్లా కారులో వెళ్తున్నారు. వాళ్ళ పిల్లలు యిద్దరూ వారిమధ్య కూర్చున్నారు, వాళ్ళు నన్ను చూసినా గుర్తు పట్టలేరు. నా రూపే మారిపోయింది. ఓ గోడమీద ఏవేవో రాసి రెండెద్దుల బొమ్మలు వున్నాయి. వాళ్ళని చూస్తే మా అబ్బాయిలు జ్ఞాపకం వచ్చారు. రోడ్డున పోతూ ఆ బొమ్మల్ని చూసిన ఒకాయన పక్కాయనతో– "ఈసారి కాడెద్దులకు భలే పోటీలే!" అన్నాడు. ఆయనకు తాళంవేస్తూ – "లేకపోతే ఏమిటయ్యా – మరీ అన్యాయంగానూ అధ్వాన్నంగానూ వుంది" అన్నాడు. "ఈ అధ్వాన్నానికీ, అన్యాయానికీ చిహ్నంగా మా బిడ్డల్ని ఉపయోగిస్తున్నారా" అనుకుని నాలో నేనే



బాధపడ్డాను. ఒక్కసారి మా 'అమ్మ గారు' పల్లెటూరూ జ్ఞాపకం వచ్చారు. కళ్ళనీళ్ళు తిరిగాయి. బాధపడి మాత్రం ఏం లాభం? మా బిడలు ఎక్కడున్నారో! ఎలా వున్నారో! ఏం చేస్తున్నారో! అని బాధపడుతూండగా, ఏవో వినరాని మాటలు వినబడ్డాయి — ఆ భాష నాకు తెలియదు. నే నెప్పుడూ వినలేదు. ఆ మనిషి కూడా మరీ కటువుగా వున్నాడు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను. నా వెనకాల నాకన్నా చిక్కిపోయిన వాళ్లు చాలామంది వున్నారు. మేమంతా లోపలకు వెళ్ళడానికి చాలా ఆలస్య మవుతుందట! ఆ పక్కనున్న ఒకావిడ నన్ను పలకరించింది. కాస్సేపు కష్టం సుఖం మాట్లాడుకున్నాం — ఆమె కథ మరీ దీనంగా వుంది. ఆమె జీవితం అంతా మదరాస్‌లోనే గడిపిందట! ఆజీవితం మరీ కృత్రిమమట! పెళ్ళీ పేరంటం అలాంటివి ఏమీ లేవుట! బిడ్డలు మాత్రం పుట్టేవారట! కాని, ఒక్కరూ దక్కలేదట! అంతే దక్కించలేదట!

"మనం యిక్కడికి ఎందుకు వచ్చినట్టు" అని మరొకామె అడిగింది.

"మానవుడికి మనం చేసిన సేవకి కృతజ్ఞతగా మనల్ని స్వర్గానికి పంపుతున్నాడు" అంది ఒకామె.

"అయితే, మానవుడు మంచివాడే!"

"ఏం మంచి? నా మొహం మంచి... మనం బతికున్నంత కాలం చంపుకు తిన్నాడు? అది చాలక చచ్చింతర్వాతకూడా తింటాడట! కృతఘ్నుడు!"

"అలా అని ఎందుకనుకోవాలి? మన జీవితం అంతా మానవుడికి వుపయోగపడుతున్నాం అని గర్వపడాలి... అంతేగాని, ఈ వయసులో మనం ఏం చేస్తాం? ఎక్కడికి పోతాం? కోపగించిపోతే, మద్రాసావిడలాగ గోడమీదవున్న పోస్టర్లు తినాల్సిందే!"

"మన ప్రాణాలు తీసినా ఫర్వాలేదు. మన బిడ్డల ప్రాణాలు తీయకపోతే అంతే చాలు! మనకి వెనకటి జీవితమూ ఒద్దు — ఆ గౌరవమూ ఒద్దు—"

"మనల్ని వధించరట" అంది ఒకామె.


"హాఁ!" అని ఒకామె కుప్పలా కూలిపోయింది. మేమంతా ఆమె దగ్గరకు వెళ్ళి చూశాం. ప్రాణాలు పోయాయి - "అయ్యో! పాపం!" అనుకున్నాం.

"ఇక్కడకు రాగానే తనకష్టాలు గట్టెక్కుతాయని గంపెడాశతో ఆమె వచ్చింది. తీరా చంపడంలేదని తెలిసి ఆ నిరాశతో గుండె ఆగి మరణించింది" అని ఆమెతో ఏభైమైళ్ళు నడిచివచ్చిన మరొకామె చెప్పింది.

"చచ్చినా, చంపబడినా చావుకు ముందూ, చావుతర్వాత కూడా నేను మానవుడికి వుపయోగపడుతున్నాను. చావుతర్వాత ఎవరికీ వుపయోగపడని మనిషికన్న నేనే గొప్ప" అనే తృప్తితోనే నా జీవితం గడపాలని నిశ్చయించుకున్నాను.

***


హెడన్‌సా




మూల వ్యాధులకు

ప్రతిచోట దొరుకును

DZ-982A TEL